క్లుప్తంగా

కమనీయంగా శోభాయాత్ర



పవిత్ర జలాల్ని తీసుకొస్తున్న మహిళలు

కవిటి : బైరాగిపుట్టుగ(కొటియావీధి)లో నూతనంగా నిర్మించిన అసిరిపోలమ్మ ఆలయం ప్రతిష్టాపన ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మూడురోజుల పాటు నిర్వహించే హోమశాల సంప్రోక్షణకు గానూ పవిత్రనదీ జలాల్ని తీసుకువచ్చేందుకు మహిళలు శోభాయాత్రగా తరలివెళ్లారు.

గంగాదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న నర్తు రామారావు దంపతులు

కంచిలి: మండల కేంద్రంలోని గొల్లకంచిలిలో ఈ నెల 25 నుంచి గణపవారి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న గంగాదేవి గావు సంబరాలలో అమ్మవారిని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, ఆయన సతీమణి నర్తు చామంతి మంగళవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, గణప సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: టెక్కలి డివిజన్ కేంద్రంలోని అయ్యప్ప నగర్‌లో కొత్తగా నిర్మించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలో ఔషధ నియంత్రణ కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దువ్వాడ వాణి, సర్పంచ్ గొండేల సుజాత, ఔషధ నియంత్రణ ఏడీ చంద్రరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.కల్యాణి, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు శిష్టు జగమ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందిస్తున్న పాలిన శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు: పదో తరగతిలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు అన్నారు. సర్పంచ్ పాలిన రమ్య, చిరంజీవి ఆధ్వర్యంలో మంగళవారం గోవిందపురం ఉన్నత పాఠశాలకు రూ.25 వేలు విలువైన కంప్యూటర్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.లింగరాజు, గ్రామస్తులు పాలిన శోభన్‌రావు, పాపారావు, జానకిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ, చారిటీ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి, వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం కన్నయ్య మాస్టర్ ఎడ్యుకేషన్ చారిటీ సంస్థ ప్రతినిధులు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఎంఈఓ తులసీరావు, సంస్థ అధ్యక్షుడు సనపల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి కింతల సుజాత, జయరాం, ఉదయశ్రీ, అంజన్, హెచ్‌ఎంలు తారకేశ్వరర్ పండా, అప్పలస్వామి పాల్గొన్నారు.

ఇంటింటికీ రక్షిత మంచినీరు



జలజీవన్ మిషన్‌ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న ఇంటింటి కుళాయి పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని సర్పంచ్ సాడి నూకమ్మ అన్నారు. మంగళవారం ముచ్చింద్ర పంచాయతీలో జల జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామ సభ ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేజేఎం టీం లీడర్ జె.వి.రమణ, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, సాడి గురుమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ సాడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

● రక్తదానం



జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా పలాస మండలం లక్ష్మీపురం టోల్ ప్లాజా వద్ద మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సిబ్బంది 50 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ డిప్యూటీ మేనేజర్ సతీష్, పలాస ఎంపీడీఓ ఎస్.రమేష్‌నాయుడు, సేఫ్ వే కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజరు సెంథిల్ కుమార్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు. – పలాస

● వస్త్రదానం



ఇచ్ఛాపురం పట్టణంలో అలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది సాధువులు, అనాథలకు వస్త్ర, అన్నదానం చేశారు. ఇటీవల అనాథసాధువు మృతిచెందడంతో పట్టణ పోలీస్ స్టేషన్ హెచ్‌సి రామారావు కర్మకాండలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎల్.నరసింహమూర్తి, ప్రతినిధులు ఉమాశంకర్, డి.గోపీనాథ్‌రెడ్డి, వాసు, కె.నరసింహమూర్తి, బుజ్జి, బాల పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం

● ఆర్థిక సాయం



ఇచ్ఛాపురం పట్టణంలోని కండ్రవీధికి చెందిన నిరుపేద కుటుంబం జగదాంబ బెహరాకు బెల్లుపడ యువత రూ.10 వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. పేదరికం కావడంతో ఇద్దరు పిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బెల్లుపడ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్పందించి మానవత్వం చాటుకున్నారు. – ఇచ్ఛాపురం

ఆర్థిక పురోగతే లక్ష్యం

● గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి సీదిరి



కొండవూరులో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: ప్రతి కుటుంబం ఆర్థిక అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం కొండవూరులో మంగళవారం సర్పంచ్ కొల్లి భాస్కరరావు అధ్యక్షతన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అమ్మ ఒడి, చేయూత, విద్యా దీవెన, జగనన్న తోడు తదితర పథకాలను మహిళల కోసం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయాలను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉద్యోగాలు ఇచ్చారని, చంద్రబాబు నాయుడు తన పాలనలో చెప్పుకోవడానికి ఏ ఒక్క పథకమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. పరిపాలన అంటే కల్లబొల్లి మాటలు చెప్పడం కాదని ప్రతీ గడపకు వెళ్లి ఈ సంక్షేమ పథకాలు మీకు ఇచ్చాం అని ధైర్యంగా చెప్పాగలగాలని.. ఆ దమ్మూ ధైర్యం తమకుందన్నారు. అందులో భాగమే ఈ గడప గడపకూ మన ప్రభుత్వం అని మంత్రి వివరించారు. ప్రతి లబ్ధిదారునికీ రూ.1.50లక్షలు నుంచి రూ.3.50 లక్షలు వరకు లబ్ధి చేకూరిందని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, ఎంపీడీఓ సీహెచ్.ఈశ్వరమ్మ, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఈఓపీఆర్‌డీ తిరుమలరావు, ఉప సర్పంచ్ లండ ఆనందరావు, మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కొల్లి రమేష్, ఇప్పిలి అప్పన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.వాసు, బూత్ కమిటీ కన్వీనర్ లాడ సూర్యనారాయణ, డాక్టర్ కె.సింహాచలం, క్లస్టర్ ఇన్‌చార్జులు దున్న బాలరాజు, మద్దిల హరినారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మద్దిల తిరుపతిరావు, పార్టీ నేతలు చింత హేమారావు, ఎ.గోవిందరావు, జి.విశ్వనాథం, ఉప్పాడ ఆనందరావు, కె.అప్పారావు, వై.శ్రీనివాసరావు, కె.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

● గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ దువ్వాడ



అనుపోజు ప్రకాశరావుకు కొత్తవీల్‌చైర్ అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో పయనించాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయంగా, అందుకే పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి మండలం లఖందిడ్డి–2 సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో కలిగిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే అధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పక్షవాతవతో బాధపడుతున్న అనుపోజు ప్రకాశరావుకు కొత్త వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చాణక్య, వీఆర్‌ఓ సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళీధర్, వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ రంజాన్‌రాజు, సర్పంచ్‌లు బమ్మిడి గణపతి, నూక సత్యరాజ్, జి.కేశవరావు, బగాది దివాకర్, కాల్ల సంజీవరావు, సుంకరి జనార్దన, ఎస్వీ రమణ, బొడ్డు వెంకటరమణ, బడ్డి శాంతారావు, బలగ సూర్యారావు, అల్లు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్సీ

లఖందిడ్డిలో గడపగడపకు మన ప్రభుత్వం జరుగుతుండగా విధి నిర్వహణలో ఉన్న సచివాలయ డిజిటల్ అసిస్టెంటు లక్ష్మణరావు ఒక్కసారిగా అనారోగ్యానికి గురై స్పృహ తప్పిపడిపోయారు. వెంటనే ఎమ్మెల్సీ గుర్తించి ఆరోగ్యసిబ్బందితో కలిసి సపర్యలు చేశారు. స్పృహ వచ్చిన తర్వాత ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.

'ఒక్క ప్రాజెక్టూ తీసుకురాని అసమర్థుడు అచ్చెన్న'



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: శ్రీకాకుళం జిల్లా కీర్తిని ఎందరో మహానుభావులు దేశ విదేశాల్లో మారుమోగిస్తే.. గతంలో మంత్రిగా పనిచేసిన కింజరాపు అచ్చెన్నాయుడు మాత్రం స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేశారని, ఇప్పుడు ఇష్టానుసారంగా మాట్లాడుతూ టెక్కలికి చీడపురుగుల్లా తయారై జిల్లా పరువు తీస్తున్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ధ్వజమెత్తారు. నందిగాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుని కుమారుడిగా పుట్టిన అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రిని ఏకవచనంతో సంబోధించడం, పోలీసులను బూతులు తిట్టడం తగదన్నారు. చంద్రబాబు, లోకేష్ మెప్పు కోసం అగౌరవంగా మాట్లాడటం భావ్యం కాదన్నారు. దిగజారి మాట్లాడే సంస్కృతి విడనాడి ముఖ్యమంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అచ్చెన్న మంత్రిగా ఉన్న సమయంలో జిల్లాకు రూ.80 కోట్లు తీసుకువచ్చి వాటిలో రూ.42 కోట్లు టెక్కలికి కేటాయించి, విదేశాల్లో ఉన్న వారి పేరున, బినామీల పేరున స్వాహా చేశారని ఆరోపించారు. ఆఫ్‌షోర్ పూర్తి చేయలేని అసమర్థ మంత్రిగా అచ్చెన్న మిగిలిపోయారని ఆక్షేపించారు. నిమ్మాడ మీదుగా చిట్టియ్యవలస రోడ్లతో సహా 68 రహదారులు పూర్తి చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సమావేశంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కురమాన బాలకృష్ణారావు, సర్లాన బైరాగి, చిన్ని జోగారావు, లవునిపల్లి ధనరాజ్, తమిరె రాజు, లోళ్ల వైకుంఠరావు, కవిటి వీరన్న, కొంకి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గడపగడపకూ మన ప్రభుత్వం

మందస: మండలంలో ఫిబ్రవరి 2 నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు చెప్పారు. మందసలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2న జిల్లుండ, 4న అంబుగాం, 7న సాబకోట పంచాయతీల్లో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

క్రీడాకారుడికి అభినందనలు



తరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

మందస: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని హరిపురం సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు జగన్నాథపురం పురుషోత్తం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగిరి తారకేశ్వరరావు అన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో జట్టును నిలబెట్టిన విద్యార్థి రాజాన తరుణ్‌కుమార్‌కు మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు వారణాసి కళావతి, మార్పు ట్రస్టు అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, పీడీ సవర రామారావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ఢిల్లేశ్వరి ప్రతిభ



ఢిల్లేశ్వరిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి రూరల్: పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని రాజాన ఢిల్లేశ్వరి అనకాపల్లిలో గత నెల 29, 30వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విద్యార్థిని అభినందించారు. పీఈటీ పి.జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వసంతరెడ్డి

సంతబొమ్మాళి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి అన్నారు. మంగళవారం అభయాంజనేయ స్వామి మొదటి వార్షికోత్సవం సందర్భంగా హనుమంతునాయుడుపేటలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల మహేష్‌రెడ్డి, కోళ్ల భాస్కరరావు, సుగ్గు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ సర్పంచ్ ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో వెలసిన కంచమ్మతల్లి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుత్తుం గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు ఇప్పిలి లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో రోజంతా పూజలు, మంగళహారతి, భజనా కార్యక్రమాలు నిర్వహించారు.


వార్షిక బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సూచనల మేరకు స్వల్ప మార్పులతో పురపాలక సంఘం 2023–24 వార్షిక బడ్జెట్‌ను ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఆమోదించారు. పురపాలక సంఘం కార్యాలయం ఆవరణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో గతేడాది సవరించిన బడ్జెట్ ముగింపు నిల్వను 2023–24 వార్షిక బడ్జెట్ అంచనా ప్రారంభ నిల్వ రూ.186,243,595గా నిర్ణయించారు. గతేడాది సాధారణ, మూలధన నిధుల రాబడి రూ..365,433,593 కాగా ఈ ఏడాదికి రూ.168,562,000గా అంచనా వేశారు. గతేడాది సాధారణ, మూలధనం నిధుల ఖర్చు రూ..178,190,000 జరగ్గా ఈ ఏడాదికి రూ.161,510,000గా అంచనా వేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. చెరువుల లీజు విషయమై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాభాల స్వర్ణమణి పాల్గొన్నారు.

సంచార పశుఆరోగ్యసేవ అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ అంబులెన్స్‌ను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం తన క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్యసేవలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఎం.కిషోర్, డిప్యూటీ డైరెక్టర్ వి.జయరాజ్, అసిస్టెంట్ డైరెక్టర్ పోతనపల్లి చంద్రశేఖరం, పశువైద్యులు డాక్టర్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శివాజీ

వజ్రపుకొత్తూరు రూరల్: బాలల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ కె.శివాజీ అన్నారు. అక్కుపల్లిలోని బాలుర మత్స్యకార గురుకుల పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల చట్టాలు, 1098 టోల్ ఫ్రీ నంబర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాపారావు, చైల్డ్‌లైన్ ప్రాజెక్ట్ ప్రతినిధులు డి.రమ, డి.జగదీష్, కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ప్రయోజనం చేకూరేలా ధాన్యం సేకరణ



మాట్లాడుతున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి

కంచిలి: రైతుకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేలా ఈ ఏడాది వరి ధాన్యం సేకరణ పద్ధతిని ప్రభుత్వం చేపట్టినట్లు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. అనంతరం పలు అంశాలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్.హైమావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు, పశువైద్యాధికారి టి.శిరీష, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

భేతాళపురంలో వైద్య శిబిరం

మందస: ఉద్దాన ప్రాంతమైన భేతాళపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత మామిడి సింహాద్రి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు సభ్యుడు బత్తిని లక్ష్మణ్ ప్రారంభించారు. జెమ్స్ వైద్యులు స్వరూప్, ప్రశాంతి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

మందస: మూలిపాడు పంచాయతీ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కైలాస్‌చౌదరి ఆకస్మికంగా మరణించడంతో ఆయన కుటుంబాన్ని ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ గుసిరి వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు యవ్వారి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ రామచంద్రచౌదరి, మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి, నాయకులు సార దూర్వాసులు, పులారి తవిటయ్య, సేనాపతి ఈశ్వరరావు, పైల నారాయణరావు, కైసలాచౌదరి భార్య త్రివేణి, కుమారుడు హేమంత్‌చౌదరి, కుమార్తెలు జ్యోతి, గౌరి పాల్గొన్నారు.

'ఆదిత్య'లో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాలకు చెందిన ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శిరీష్‌కుమార్ రాసిన డేటా కమ్యూనికేషన్ అండ్ నెట్‌వర్కింగ్ అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. బీటెక్, డిప్లమో కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.ఆజాద్, ఈసీఈ హెచ్ఓడీ బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ల నియామకం

నందిగాం : మండలంలోని లట్టిగాం, దిమిలాడ పీఏసీఎస్ చైర్మన్లుగా కురమాన బాలకృష్ణారావు, సర్లాన బైరాగిలను మరోసారి నియమించారు. లట్టిగాం సొసైటీ సభ్యులుగా వాడవలస కృష్ణారావు, బుడ్డ జోగారావులు, దిమిలాడ పీఏసీఎస్ సభ్యులుగా బొంగి హనుమంతురావు, రట్టి నాగరాజులను నియమించినట్లు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీల నుంచి మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

కలెక్టర్ దృష్టికి రైతుల సమస్యలు

సోంపేట: డివిజన్ పరిధిలో గోల్డెన్ ల్యాండ్ భూములకు సంబంధించి రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని పలాస ఆర్డీఓ తమరాల సీతారామమూర్తి అన్నారు. సోంపేట డివిజన్ పరిధిలోని రైతులతో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. తహసీల్దార్ ఎస్.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోండి

సంతబొమ్మాళి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా తీసుకున్న రుణాలను రైతులు రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు కోరారు. మంగళవారం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ ఫిబ్రవరి 28లోగా 4 శాతం వడ్డీతో రుణాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఒరిజినల్ 1బి, బయోమెట్రిక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటో తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మాధురి పాల్గొన్నారు.

'మద్యం తాగినా.. హెల్మెట్ పెట్టకపోయినా ఒకే నేరం'

కాశీబుగ్గ: మద్యం తాగి వాహనం నడిపినా.. హెల్మెట్ పెట్టకుండా బండి డ్రైవ్ చేసినా ఒకే నేరం వర్తిస్తుందని కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు కాశీబుగ్గ డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి పర్యవేక్షణలో హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీసీలు సోమేశ్వరరావు, గూన కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కవిటి: మండలంలోని లోళ్లపుట్టుగలో కల్యాణ వేంకటేశ్వరస్వామి 53వ తిరుకల్యాణోత్సవాలు, 42వ సుప్రభాత వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయ అనువంశిక అర్చకులు అప్పలస్వామి పర్యవేక్షణలో ధర్మకర్తలు స్వామివారి ఉత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అనంతరం సింహాచలశాస్త్రి భాగవతార్ ఆలపించిన పోతన భాగవతం హరికథాగానం అలరించింది.